# కృష్ణారావు కోపం పోయింది

**బి.వి. జగన్మోహన్‌రావ్**

ప్రపంచంలోని కోపమంతా కృష్ణారావు దగ్గరే వుందేమో అనిపిస్తుంది.

కోపంలో ఏదైనా పోటీ పెడితే కృష్ణారావే మొదటి బహుమతి కొట్టేస్తాడు.

ఒక్కమాటలో చెప్పాలంటే కోపమూ, కృష్ణారావూ ఇద్దరూ ఒకేసారి పుట్టారేమోననిపిస్తుంది.

ప్రతి చిన్న విషయానికి కోపం వచ్చేస్తుంది కృష్ణారావుకి.

అలా అని అతడు దుష్టుడు, దుర్మార్గుడూ కాదు మరి!

కోపాన్ని కంట్రోల్ చేసుకోలేని బలహీనుడయి పోయాడు.

కృష్ణారావు అర్థాంగి సత్యవతి.

అతని సగభాగం. కాబట్టి రూలు ప్రకారం కోపాన్ని కూడా సగం పంచుకోవాలంటారు కదా!

కానీ—

నిజంగా ఆమెను చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. కోపం, చిరాకు అంటే అర్థం ఏవిటో తెలీనట్లుంది.

గత ఎనిమిదేళ్ళుగా ఆమె కృష్ణారావు కోపాన్ని భరిస్తోంది.

కూరలో కొద్దిగా ఉప్పో, కారమో ఎక్కువైంది అనుకోండి. నెమ్మదిగా అడగొచ్చు కదా!

అంతే! అన్నం కంచం కపిల్‌దేవ్ కొట్టిన సిక్సర్‌లా ఎగిరి పడుతుంది.

''ఏదో పొరపాటున ఎక్కువైంది'' అని సత్యవతి చెప్పబోతే ''మామూలేగా! ఏదో ఓ సాకు'' అంటూ చేతికి దొరికిన వాటినల్లా నేలకేసి కొట్టేస్తూ బయటికి వెళ్లిపోతాడు.

ఒకసారి—

''నాన్నా! ప్రోగ్రెస్ రిపోర్ట్ సంతకం చెయ్యాలి'' అంటూ వచ్చిన ఆరేళ్ల రవి వంక ఓ తీక్షణ చూపుచూసి రిపోర్ట్‌ని చదివాడు.

''ఏవిట్రా! వెధవ మార్కులూ నువ్వూను, నెలకి ఏభయ్యేసి ఫీజు తగలేసేది ఎందుకు?'' అంటూ దాన్ని చించినంత పన్జేసి సంతకం గీకేసి వాడి మొహం మీదకి విసిరేశాడు.

తండ్రి సంగతి ఆ చిన్న వయసు లోనే బాగా స్టడీ చేసిన రవి మారు మాటాడకుండా వెళ్లిపోయాడు.

ఒక్కోసారి కృష్ణారావే ఆలోచిస్తాడు. తనెందుకు మరీ ఇలా ప్రవర్తిస్తాడు? కోపాన్ని, చిరాకుని ఏ మాత్రం ఆపుకోలేక పోతున్నాడు.

ఎందరో డాక్టర్లని కన్‌సల్ట్ చేశాడు.

లాభం లేకపోయింది.

అదేం చిత్రమో ఆఫీసులో పనిచేసేటప్పుడు అతనికి కోపం వచ్చేట్టుగా ఏ సంఘటనా జరగదో ఏమో ఇంత వరకూ స్టాఫ్ కృష్ణారావు కోప ప్రదర్శనని తిలకించలేదు.

ఎవరయినా చుట్టాలొచ్చినా వాళ్ల ముందు పరువు పోవాల్సిందే!

ఓ సారి రేడియోలో తనకి యిష్టం లేని పాట వచ్చిందని ''వెధవ రేడియో''! అంటూ దాన్ని అమాంతం చేత్తో పట్టుకుని విసిరేయ బోయినంత పన్జేశాడు. సమయానికి సత్యవతి వచ్చి దాని ప్రాణం కాపాడింది కాబట్టి సరిపోయింది.

ఇలా కృష్ణారావు కోపం రాగానే అతడి చేతికి ఏది అందుబాటులో వున్నా ఫినిష్. నెలకి రెండు ఫ్లవర్‌వాజ్‌లన్నా పగులుతాయి. వాళ్లింట్లో వున్న బిందెలు, గిన్నెలు, యించుమించు చాలా వరకు అన్నీ సొట్టలు పడి వుంటాయి. ఎప్పటి కప్పుడు మొదట్లో సొట్టలుతీయించేది సత్యవతి. కానీ తరువాత మానేసింది, అనవసరమైన ఖర్చెందుకని.

కృష్ణారావుకి ఈ చిరాకు, కోపం ఎలా పోగొట్టాలో తెలియడం లేదు సత్యవతికి.

ఆవాళెందుకో మరీ చిరాకుగా వున్నాడు కృష్ణారావు. కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగు తున్నాడు.

మొదటిసారిగా ఆఫీసులో కొత్తగా వచ్చిన మేనేజర్‌తో బాగా చీవాట్లు తిన్నాడు. మేనేజర్ ముందు కిక్కురు మన లేక పోయాడు. ఇంటి కొచ్చాక కోపం వీరలెవెల్లో వచ్చేసింది.

అటూ ఇటూ తిరుగుతున్న కృష్ణారావు దృష్టి టేబిల్ మీద వున్న పేపర్ వెయిట్ పై పడింది.

చటుక్కున తీసుకుని కసికొద్దీ వీధి లోకి విసిరాడు.

అంతే!

ఆ అన్న కేక వినిపించి బయటికి వచ్చి చూశాడు.

సరిగ్గా అప్పుడే లోపలికి వస్తున్న కృష్ణారావు బావమరిది శంకరం కాలును చాలా చక్కగా కాలిగోరు వూడొచ్చేలా ముద్దుపెట్టు కుంది పేపర్‌వెయిట్.

కృష్ణారావు సంగతి తెలిసిన శంకరం కిక్కురు మనలేదు. బలవంతాన ఆముదం తాగినవాడిలా ఓ వెర్రి నవ్వు నవ్వాడు.

ఈ దెబ్బతో బావ కోపాన్ని ఎలా అయినా పోగొట్టాలను కున్నాడు. ఏదైనా చేసి అతని తిక్క కుదర్చాలి.

'ఉష్ణేణ ఉష్ణం శీతలం'

సడెన్‌గా ఇది గుర్తొచ్చింది శంకరానికి.

కృష్ణారావుకి బా...గా...కోపం తెప్పించ గలిగితే ఇక ఆ తర్వాత పంక్చరయిన టైర్లోంచి గాలిపోయినట్లు అతన్లోని కోపమంతా పోతుందను కున్నాడు.

అతన్ని నానా తిప్పలూ పడి బతిమాలి రెండ్రోజులకి ఒక తెలుగు సినిమాకి తిసుకెళ్లడం మొదలెట్టాడు శంకరం.

పది సినిమాలు చూపించాడు. తనుమాత్రం కళ్లు మూసుకు కూర్చునేవాడు.

ఖచ్చితంగా మారతాడనుకున్నాడు.

కానీ ఆ పది తెలుగు సినిమాలు చూశాక కృష్ణారావులో కోపం రెట్టింపయింది. ఇంకోసారి

**అక్కా! ఇదిగో మీ ఆయన్ని మార్చి అతని కోపం తాపం ఎగర గొట్టి తిక్క కుదిర్చే సాధనాన్ని తాచ్చాను. బావని ఎలాగైనా దీనిముందు కూర్చోబెట్టు చాలు. ఒక్క పది రోజులు అంతే! పులి లాంటి బావ పిల్లిలా అయిపోతాడు.!!**

తన గుమ్మం తొక్కొద్దని శంకరాన్ని హెచ్చరించాడు.

ఒక రోజు మధ్యాహ్నం ఓ పెద్ద బాక్స్ తో వచ్చాడు శంకరం.

''అక్కా!ఇదిగో మీ ఆయన్ని మార్చి అతని కోపం తాపం ఎగర గొట్టి తిక్క కుదిర్చే సాధనాన్ని తెచ్చాను. బావని ఎలా అయినా దీని ముందు కూర్చోబెట్టు చాలు. ఒక్క పది రోజులు. అంతే! పులిలాంటి బావ పిల్లయి పోతాడు. హైదరాబాద్‌లో ఇలాంటి ట్రీట్ మెంట్ చాలా మందికి జరిగింది. జరుగుతోంది కూడా! అన్నాడు శంకరం సర్వం తెలిసిన మేధావిలా.

దాన్ని చూసిన సత్యవతి ఆశ్చర్యపోయింది. 'మరి ఇది ఎక్కడిదీ' అని అడిగితే అని సందేహం వెలిబుచ్చింది

''ఆ కొశ్చన్‌లు వెయ్యకముందే ఇది ఆన్ చెయ్యి. ఆ తరువాత ఇంకేం అడగలేడు'' అని చెప్పి వెళ్లిపోయాడు.

* * *

సాయంత్రం కృష్ణారావు ఇంటి కొచ్చాడు.

మొహం కడుక్కొని వచ్చి కుర్చీలో కూర్చున్నాడు తనకెదురుగా టేబిల్ మీద ఏదో వస్తువు వుండడం చూశాడు.

''సత్యా! ఏవిటిది'' సహజ ధోరణిలోనే అడిగాడు.

''ఇదీ! మరేమో! మీరలా కూర్చోండి'' అంటూ దానిపై వున్న కవర్‌ని తీసేసింది.

అది మరేదో కాదు!

టీవీ!

''ఇదెక్కడిది!'' కోపంగా అడిగాడు.

''మా తమ్ముడు శంకరంకి తెల్సిన వాళ్ల దగ్గర తెచ్చాడు.. నెలకి చాలా తక్కువ ఇన్‌స్టాల్ మెంటే..'' అంటూ గబుక్కున టి.వి స్విచ్ ఆన్ చేసింది.

ఎనౌన్సర్ హి..హి..అంటూ నవ్వుతూ నమస్కారం అనగానే బుద్ధిగా చూడ సాగాడు కృష్ణారావు.

ఎవరో హిప్నటైజ్ చేసినట్లు అలాగే అర గంట వుండిపోయాడు. ఏవేవో కార్యక్రమాలు వస్తున్నాయి.

అతన్లో ఏదో నిస్సత్తువ రాసాగింది.

తనలో వున్న కోపాన్నంతా బయటికి తెచ్చి గట్టిగా అరవాలనుకున్నాడు. కానీ నోరు పెగ లేదు. అది చూసిన ఎనౌన్సర్ అదోలా నవ్వాడు. గట్టిగా జుట్టు పీక్కున్నాడు కృష్ణారావు మరేం చేయలేక. టీవీలో ప్రోగ్రాం ఏవిటో అర్థం కావడం లేదు.




ఏవిటీ తనేమయిపోతున్నాడు. టీవీ చూస్తూ ఎందుకిలా నీర్సించి పోతున్నాడు. తన కోపమంతా ఏమయింది.

అలాగే పిచ్చివాడిలా చూస్తుండి పోయాడు.

వారం రోజులు గడిచాయి.

ఎవరో మంత్రం వేసి కట్టేసి కూర్చోబెట్టినట్టుగా రోజూ టీవీ చూస్తున్నాడు. అతన్లో సహనం, ఓర్పు పెరగడం మొదలెట్టాయి. కోపం అంతమొందడం ప్రారంభమయింది.

నెలరోజులకల్లా కృష్ణారావులో పూర్తి మార్పు వచ్చింది.

అసలు కోపం అంటే తెలీని వాడిలా తయారయాడు.

'అపర సహనమూర్తి' అనే బిరుదు ఇవ్వచ్చు అనేలా రూపొందించాడు.

తన భర్త కోపాన్ని అణగ ద్రొక్కి కృష్ణారావు సహనానికి పరీక్ష పెట్టి తాను ఓడిపోయి అతన్ని గెలిపించి శాంతమూర్తిగా మార్చిన దూరదర్శన్‌కి కోటి నమస్కారాలు చేసింది సత్యవతి కృతజ్ఞతగా.

*